క్లుప్తంగా

ఇంటింటా భగవద్గీత పంపిణీ



పుస్తకాలు అందిస్తున్న సేవాసమితి సభ్యులు

జగిత్యాలరూరల్: త్రైతసిద్ధాంతం హిందు జ్ఞాన వేదిక ప్రబోధ సేవాసమితి ఆధ్వర్యంలో సోమవారం జగిత్యాల రూరల్ మండలంలోని వెల్దుర్తి గ్రామంలో ఇంటింటా భగవద్గీత పంపిణీ చేశారు. సేవాసమితి కొడిమ్యాల మండల అధ్యక్షుడు రాకేశ్, ఆంజనేయులు, వేణు, నాగేశ్వర్‌రావు, విక్రమ్, దీక్షిత్, సునీత పాల్గొన్నారు.

స్వచ్ఛపట్టణంగా తీర్చిదిద్దాలి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న కమిషనర్

మెట్‌పల్లి: స్వచ్ఛ పట్టణంగా మెట్‌పల్లిని తీర్చిదిద్దడానికి ప్రజలు సహకరించాలని కమిషనర్ జగదీశ్వర్‌గౌడ్ కోరారు. మున్సిపల్ కార్యాలయంలో సోమవారం శానిటైజేషన్‌కు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించి మాట్లాడారు. ప్రతీ ఇంటిలో తడి, పొడి చెత్తను వేర్వేరుగా చేసి అందించాలన్నారు. ఖాళీ ప్రదేశాల్లో చెత్త వేయొద్దని.. ప్లాస్టిక్ కవర్లను వినియోగించొద్దని సూచించారు. అంతకుముందు సిబ్బందితో స్వచ్ఛతపై ప్రతిజ్ఞ చేయించారు. మేనేజర్ వెంకటలక్ష్మి ఉమ, రత్నాకర్, విష్ణు, ముజీబ్ ఉన్నారు.

ఎల్‌వోసీ అందజేత



ఎల్‌వోసీ అందిస్తున్న జెడ్పీటీసీ భూమయ్య

కథలాపూర్: మండలంలోని చింతకుంటకు చెందిన మారంపెల్లి రుత్విక్ వైద్యం కోసం రూ.2.50 లక్షల ఎల్‌వోసీని జెడ్పీటీసీ నాగం భూమయ్య సోమవారం అందించారు. రుత్విక్ అనారోగ్యానికి గురికాగా మెరుగైన వైద్యం కోసం ఎల్‌వోసీకి దరఖాస్తు చేసుకున్నారని ఈ సందర్భంగా చెక్కు అందించినట్లు జెడ్పీటీసీ తెలిపారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్‌పర్సన్ గుండారపు సౌజన్య, ఎంపీటీసీ బొడ్డు బాలు, టీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు గడీల గంగప్రసాద్, సింగిల్‌విండో డైరెక్టర్ పంచతి శంకర్, నాగేశ్వర్‌రావు వ్యాసమహర్షి, రమేశ్ పాల్గొన్నారు.

ఆంజనేయులుకు ఆదియోగి పురస్కారం



పురస్కారం అందుకుంటున్న ఆంజనేయులు

రాయికల్: మండలంలోని కట్కాపూర్‌కు చెందిన మాలెపు ఆంజనేయచారి ఆధ్యాత్మిక రంగంలో చేసిన సేవలకు వేములవాడలోని లంబోదర కల్చరల్ అకాడమీ ఆధ్వర్యంలో ఆదియోగి పురస్కారం అందుకున్నారు.ఆంజనేయచారిని గ్రామస్తులు అభినందించారు.

కళాకారులకు సన్మానం

కొడిమ్యాల: ప్రపంచ రంగస్థల దినోత్సవం సందర్భంగా తారకరామ కళా నిలయం కళాకారులను కొడిమ్యాలలోని విజ్ఞం పాఠశాలలో సోమవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సీనియర్ కళాకారులు బోయిని రాజయ్య, సందిరెడ్డి రాజిరెడ్డి, నిజాం రాజన్న, చిన్నన్న, వడ్లకొండ హన్మండ్లు, బ్రహ్మానందంను ఘనంగా సన్మానించారు. తారకరామ కళానిలయం సభ్యులు బొమ్మ సురేశ్, సత్యానందం, హెచ్‌ఎం ఏనుగు ఆదిరెడ్డి, శేఖర్ పాల్గొన్నారు.

'కంటివెలుగు' వైద్యశిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి



వైద్యశిబిరాన్ని ప్రారంభిస్తున్న జెడ్పీటీసీ

ధర్మపురి: 'కంటివెలుగు' కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాని జెడ్పీటీసీ బత్తిని అరుణ అన్నారు. మండలంలోని రాజారం గ్రామంలో సోమవారం జెడ్పీటీసీ చేతుల మీదుగా కంటివెలుగు కార్యక్రమాన్ని ప్రారంభించారు. నిరుపేదల కోసం ప్రభుత్వం 'కంటివెలుగు' కార్యక్రమాన్ని ప్రారంభించిందన్నారు. కంటికి సంబంధించిన ఏ సమస్యలున్నా పరీక్షలు చేసుకోవాలన్నారు. వైద్యులు కంటి పరీక్షలు చేసి అవసరమైనవారికి కంటి అద్దాలు, మందులు అందిస్తారన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ బండారు లహరిక, ఆర్.ఎస్.ఎస్ మండల అధ్యక్షుడు భీమన్న, నాయకులు బండారు మురళి, జెల్ల బుచ్చన్న, రాకేశ్ ఉన్నారు.

సబ్‌స్టేషన్‌తో తొలగనున్న తిప్పలు

- రూ.1.76 కోట్లతో నిర్మాణం
- మూడు గ్రామాలకు తీరనున్న లోవోల్టేజ్ సమస్య
- ప్రారంభానికి సిద్ధంచేస్తున్న అధికారులు



అమ్మక్కపేటలో ప్రారంభానికి సిద్ధంచేసిన సబ్‌స్టేషన్

ఇబ్రహీంపట్నం: మూడు గ్రామాల రైతులు, వినియోగదారులు లోవోల్టేజ్ సమస్యతో ఇబ్బందులు పడుతుండడంతో పలుసార్లు అధికారులకు, ప్రజాప్రతినిధులకు లోవోల్టేజ్ సమస్య పరిష్కరించాలని విన్నవించారు. ఇబ్రహీంపట్నం సబ్‌స్టేషన్ నుంచే అమ్మక్కపేట, డబ్బా, ఎర్రాపూర్ గ్రామాలకు విద్యుత్‌సరాఫరా చేస్తుండడంతో తరచూ విద్యుత్ సరఫరాలో సమస్యలు వస్తుండడంతో రైతులు, వినియోగదారులు అనేక ఇబ్బందులు పడ్డారు. ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు చొరవతో మూడు గ్రామాల ప్రజల ఇబ్బందులు తొలగించేందుకు రూ.1.76కోట్లతో అమ్మక్కపేటలో సబ్‌స్టేషన్ ఏర్పాటుకు నిధులు మంజూరు చేశారు. జనవరి 3, 2022న ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు శంకుస్థాపన చేశారు. పనులను ప్రారంభించిన కాంట్రాక్టర్ చకచక పనులు చేసి సబ్‌స్టేషన్‌ను ప్రారంభానికి సిద్ధం చేశారు.

మూడు గ్రామాలకు లబ్ధి..

సబ్‌స్టేషన్ నిర్మాణంతో అమ్మక్కపేటలో 536 గృహాలు, వ్యవసాయ పంపుసెట్లు 462, డబ్బా గృహలకు 678, వ్యవసాయ పంపుసెట్లు 527, ఎర్రాపూర్‌లో 128 గృహాలకు 150 వ్యవసాయ పంపుసెట్లకు 1139 మంది రైతులకు నాణ్యమైన విద్యుత్ సరాఫరా చేయనున్నారు. ఈ సబ్‌స్టేషన్ నిర్మాణంతో ఇబ్రహీంపట్నం సబ్‌స్టేషన్‌పై అధిక లోడ్ సమస్య తప్పనుంది. అలాగే డబ్బాకు కొత్త ఫీడర్ నిర్మించాలని ఎమ్మెల్యే ఆదేశాలతో అంచనాలు రూపొందించి ఆపరేషన్‌వింగ్‌లో భాగంగా విద్యుత్‌శాఖ అధికారులకు పంపించారు. ఈ సబ్‌స్టేషన్ ద్వారా ప్రత్యేక ఫీడర్లు ఏర్పాటుచేసి అధికారులు ప్రారంభానికి సిద్ధం చేస్తున్నారు. త్వరలోనే సబ్‌స్టేషన్‌ను ప్రారంభించనున్నట్లు విద్యుత్‌శాఖ అధికారులు తెలిపారు.

తీరనున్న కరెంట్ కష్టాలు



అమ్మక్కపేటలో సబ్‌స్టేషన్ నిర్మాణంతో ఎన్నోఏళ్లుగా కరెంటు కోసం ఎదురుచూస్తున్న రైతులకు, వినియోగదారులకు కష్టాలు తీరనున్నాయి. రైతులకు ఎంతో మేలు కలుగుతుంది.

– భూమరెడ్డి, రైతు, అమ్మక్కపేట

లోవోల్టేజ్, ఓవర్‌లోడ్ తగ్గుతుంది

అమ్మక్కపేట సబ్‌స్టేషన్‌తో డబ్బా, అమ్మక్కపేట, ఎర్రాపూర్ గ్రామాల రైతులకు వినియోగదారులకు పరిశ్రమల యాజమానులకు లోవోల్టేజ్, ఓవర్‌లోడ్ సమస్య తగ్గనుంది. సబ్‌స్టేషన్‌ను ప్రారంభించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం.

– శ్రీనివాస్‌రావు, ఏడీఈ

తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలి



మాట్లాడుతున్న మున్సిపల్‌చైర్‌పర్సన్ సత్తెమ్మ

ధర్మపురి: వేసవిలో ఎండలు ముదురుతున్నందున పట్టణంలో తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని మున్సిపల్ చైర్‌పర్సన్ సంగి సత్తెమ్మ సూచించారు. ధర్మపురి మున్సిపల్ కార్యాలయంలో సోమవారం వేసవి ఎండల తీవ్రతపై కమిషనర్‌తో పాటు కౌన్సిలర్లతో ప్రత్యేక సమావేశం నిర్వహించి మాట్లాడారు. వేసవిలో పట్టణ ప్రజలకు తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని అందుకు పట్టణంలోని ప్రతీ వార్డులో ఏ సమస్యలున్న కార్యాలయంలో తెలపాలన్నారు. వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోవాలని కోరారు. సమస్యలు తలెత్తకుండా ఇప్పటి నుంచే పరిష్కార మార్గాలు అన్వేషించుకోవాలన్నారు. అదే విధంగా పట్టణంలో పన్ను బకాయిలు అధికంగా ఉన్నాయని వందశాతం పన్నుల రికవరీకి కృషిచేయాలని కౌన్సిలర్లను కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్‌చైర్మన్ రామన్న, పలు వార్డులకు చెందిన కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు తదితరులున్నారు.

మొక్కుబడిగా సర్వసభ్య సమావేశం



మాట్లాడుతున్న ఎంపీపీ విమల, జెడ్పీటీసీ

మల్యాల: మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఎంపీపీ మిట్టపల్లి విమల అధ్యక్షతన నిర్వహించిన సర్వసభ్య సమావేశం మొక్కుబడిగా సాగింది. కిందిస్థాయి సిబ్బంది సమావేశానికి హాజరుకావడంపై సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. సగానికిపైగా అధికారులు హాజరుకాలేదని మండల సర్పంచుల ఫోరం అధ్యక్షుడు మిట్టపల్లి సుదర్శన్ ఆగ్రహం వ్యక్తంచేశారు. బల్వంతాపూర్‌లో ట్రాన్స్‌ఫార్మర్ గద్దె రెండుసార్లు కూల్చినా పోలీసులకు ఎందుకు ఫిర్యాదుచేయడం లేదని విద్యుత్‌శాఖ అధికారులను మల్యాల పీఏసీఎస్ రాంలింగారెడ్డి ప్రశ్నించారు. ప్రభుత్వాస్పత్రిలో కుక్కకాటుకు మందు కోసం వెళ్తే ఐదురుగు ఉంటేనే టీకా వేస్తామనడం ఎంతవరకు సమంజసమన్నారు. ఈక్రమంలో వైద్యసిబ్బందిపై ఆగ్రహం వ్యక్తంచేశారు. ఎవరూ వచ్చినా టీకాలు వేయాలని కోరారు. శ్మశానవాటికలు పూర్తయ్యాయని అధికారులు ప్రగతి నివేదిక చదివితే గుడిపేటలో పూర్తికాకుండానే పూర్తయినట్లు ఎలా రిపోర్టు సిద్ధం చేస్తారంటూ ఎంపీటీసీ రాచర్ల రమేశ్ నిలదీశారు. రాజారం గ్రామంలో మిషన్ భగీరథ నీళ్లు రావడం లేదని ఇంటింటికి నీళ్లు ఇస్తున్నామని ఎలా చెబుతున్నారని పోతారం పీఏసీఎస్ చైర్మన్ అయిల్నేని సాగర్‌రావు ప్రశ్నించారు. సమావేశానికి రాని అధికారులకు నోటీసులు జారీ చేయాలన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ కొండపల్కల రాంమోహన్‌రావు, వైఎస్ ఎంపీపీ పోతాని రవి, ఎంపీటీసీలు కొల్లూరి గంగాధర్, మారంపల్లి నర్సవ్వ, నవత, రవళి, రాచర్ల రమేశ్, సఫియా వలీ, ఎంపీడీవో వెంకటేశం తదితరులు పాల్గొన్నారు.

డబుల్‌రోడ్డు నిర్మాణం ప్రారంభించండి



వినతిపత్రం ఇస్తున్న బీజేపీ నాయకులు

మేడిపెల్లి: మండలకేంద్రం నుంచి గోవిందారం వరకు డబుల్‌రోడ్డు నిర్మాణం ప్రారంభించాలని.. సోమవారం జగిత్యాలలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో బీజేపీ నాయకులు అడిషనల్ కలెక్టర్‌కు వినతిపత్రం అందించారు. ఈమేరకు టెండర్లు పూర్తయి నాలుగు నెలలు గడుస్తున్నా పనులు ప్రారంభించడం లేదని వినతిపత్రంలో పేర్కొన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు మోరపెల్లి సత్యనారాయణ, క్యాతం దశరథరెడ్డి, ఎస్ఎన్.రెడ్డి, ఇజ్రాయేల్, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

'ప్రజావాణి' సద్వినియోగం చేసుకోవాలి

పెగడపల్లి: ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రతీ సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ కృష్ణచైతన్య కోరారు. ఈమేరకు సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రజల నుంచి వచ్చిన ఆర్జీలపై వెంటనే విచారణ జరిపి పరిష్కారించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. నందగిరి గ్రామంలో జరిగిన ఉపాధిహామీ పనుల వివరాలు తెలపాలని కోరుతూ గ్రామానికి చెందిన మామిడి లక్ష్మీనారాయణ అనే వ్యక్తి దరఖాస్తు చేసినట్లు అధికారులు తెలిపారు. తహసీల్దార్ కృష్ణచైతన్య, ఎంపీవో మహేందర్, వెటర్నరీ డాక్టర్, విక్రమ్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుభద్ర, ఏపీఎవ సమత, డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాస్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ హరిబాబు, పీఆర్ ఏఈ శంషేర్‌అలీ, ఏఈవో అశోక్ పాల్గొన్నారు.



ప్రజావాణిలో పాల్గొన్న అధికారులు

ఒకేఒక్క దరఖాస్తు

ఇబ్రహీంపట్నం: మండలకేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన 'ప్రజావాణి' కార్యక్రమానికి ఒక్క దరఖాస్తు వచ్చినట్లు తహసీల్దార్ మహేశ్వర్ తెలిపారు. అమ్మక్కపేటకు చెందిన ప్రమీల 35 కిలోల బియ్యం అందించాలని దరఖాస్తు చేసుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో ప్రభు, ఎంపీవో కృపాకర్, ఏవో దీపిక, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ప్రతిభ, ఏఈలు పాల్గొన్నారు.

పార్టీ కోసం పనిచేసే ప్రతీ కార్యకర్తకు గుర్తింపు

- ఆత్మీయ సమ్మేళనాలు విజయవంతం చేయాలి
- చొప్పదండి ఎమ్మెల్యే సుంకె రవిశంకర్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుంకె రవిశంకర్

కొడిమ్యాల: బీఆర్‌ఎస్ పార్టీ కోసం పనిచేసే ప్రతీ కార్యకర్తకు గుర్తింపు ఉంటుందని త్వరలో నిర్వహించే ఆత్మీయ సమ్మేళనాలు విజయవంతం చేయాలని చొప్పదండి ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ కోరారు. సోమవారం మండలంలోని నాచుపల్లి బృందావన్ రిసార్ట్స్ కొడిమ్యాలలో మండలాల నాయకులతో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించి మాట్లాడారు. సాధారణ ఎన్నికలకు కొన్నినెలలే సమయం ఉన్నందున ఇప్పటి నుంచే కార్యాచరణ రూపొందించాలన్నారు. గ్రామస్థాయి నుంచి ప్రతి ఒక్కరూ ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొనేలా చూడాలన్నారు. మండలాల్లో జనాభా ప్రాతిపదికన ఆత్మీయ సమ్మేళనాలు నిర్వహిస్తున్నామని ప్రతీ కార్యకర్తను సమన్వయం చేసుకోవాలని సూచించారు. ఆయా మండలాల ఎంపీపీలు, జెడ్పీటీసీలు, పార్టీ అధ్యక్షులు, సింగిల్‌విండో, మార్కెట్‌కమిటీ చైర్మన్లు, రైతుబంధు సమితి అధ్యక్షులు, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలు ప్రజల్లోకి తీసుకెళ్లాలి



ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న నాయకులు, ముఖ్య కార్యకర్తలు

- ఎమ్మెల్యే సంజయ్‌కుమార్, జెడ్పీచైర్‌పర్సన్ దావ వసంత

జగిత్యాలరూరల్: ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్, జెడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత అన్నారు. సోమవారం జగిత్యాల అర్బన్, రూరల్ మండలాల ముఖ్యకార్యకర్తల ఆత్మీయ సమ్మేళనం పద్మనాయక కల్యాణ మండపంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ పేదల పక్షపాతి అని, రాష్ట్రంలో ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు అందించిన ఘనత కేసీఆర్‌దేనన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు అందేలా కార్యకర్తలు కీలకపాత్ర పోషించాలన్నారు. ఎమ్మెల్సీ కవిత ప్రోత్సాహంతోనే నియోజకవర్గ అభివృద్ధికి నిరంతరం కృషిచేశామన్నారు. ప్రభుత్వంపై వస్తున్న అసత్యపు ప్రచారాలను తిప్పికొట్టే బాధ్యత కార్యకర్తలదేనన్నారు. ప్రభుత్వం కార్యకర్తలకు అన్నివిధాలుగా అండగా ఉంటుందని, దేశంలో ఎక్కడ లేనివిధంగా రాష్ట్రంలో సంక్షేమ పథకాలు అమలవుతున్నాయన్నారు. కేంద్ర ప్రభుత్వం తెచ్చిన ఫసల్‌బీమా పథకం రైతులను మోసం చేసేలా ఉందని, ఒక మండలం యూనిట్‌గా చేసి మండలం పూర్తిగా నష్టపోతేనే రైతులకు నష్టపరిహారం వస్తుందన్నారు. రైతుబంధు వచ్చే ప్రతీ రైతుకు పీఎం కిసాన్ అమలుచేయాలని, ఆయుష్మాన్ భారత్ పథకం అనేది ఆరోగ్యశ్రీకి వర్తించే బీద, బడుగు, బలహీనవర్గాల వారికి కూడా వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ రాజేంద్రప్రసాద్, జెడ్పీటీసీ మహేశ్, మార్కెట్‌కమిటీ చైర్మన్ నక్కల రాధ, సింగిల్‌విండో చైర్మన్లు మహిపాల్‌రెడ్డి, సందీప్‌రావు, మాజీ చైర్మన్లు దామోదర్‌రావు, దశరథరెడ్డి, సర్పంచులు చెరుకు జాన్, గంగాధర్, నాయకులు బాలముకుందం,సురేందర్‌రెడ్డి, శేఖర్,ఆసీఫ్, రవీందర్‌రెడ్డి, జుంబర్తి శంకర్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సంజయ్‌కుమార్

ఆహ్వాన పత్రిక అందజేత

జగిత్యాల రూరల్ మండలం హన్మాజీపేట శివారులోని శ్రీ సీతారామచంద్రస్వామి కల్యాణ మహోత్సవానికి హాజరు కావాలని గ్రామస్తులు సోమవారం ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ ఆహ్వానపత్రిక అందించారు.సర్పంచ్ బొడ్డు దామోదర్, ఉపసర్పంచ్ రాజ నర్సయ్య, ఆలయ చైర్మన్ మంచాల మల్లేశం, నాయకులు నరేశ్, మహేశ్ పాల్గొన్నారు.

చెక్కు పంపిణీ

జగిత్యాలరూరల్ మండలంలోని గుల్లపేట మడలేశ్వరస్వామి ఆలయానికి డీఎంఎఫ్‌టీ రూ.1.84 లక్షల నిధులతో కాంపౌండ్‌వాల్ నిర్మాణం పూర్తికాగా, సోమవారం ఎమ్మెల్యే సంజయ్‌కుమార్, జెడ్పీచైర్‌పర్సన్ దావ వసంత పంపిణీ చేశారు. సర్పంచ్ జక్కుల తిరుపతి, ఎంపీటీసీ దమ్మ సురేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్ కాలనీలో ఎమ్మెల్యే పర్యటన



కాలనీవాసులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

కోరుట్ల: పట్టణ శివారులోని పెద్దగుండు ప్రాంతంలో నిర్మించిన డబుల్ బెడ్రూం కేసీఆర్ కాలనీని ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు సోమవారం సందర్శించారు. తహసీల్దార్ నీరటి రాజేశ్, కమిషనర్ ఎండీ.అయాజ్‌తో కలిసి ఎమ్మెల్యే కాలనీ వాసులతో ముఖాముఖి మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కాలనీవాసులు శ్మశాన వాటిక, ఖబరస్థాన్, ఆలయం, మజీద్‌కు స్థలం కేటాయించాలని ఎమ్మెల్యేను కోరారు. డబుల్ బెడ్రూంలలోని పలు సమస్యలు కూడా ఎమ్మెల్యేకు చూపించారు. పరిష్కారానికి కృషిచేస్తానని ఎమ్మెల్యే హామీఇచ్చారు. ఎమ్మెల్యే వెంట పలువురు కౌన్సిలర్లు, అధికారు లు ఉన్నారు.

ఎమ్మెల్యేకు ఆహ్వానం

మల్లాపూర్: మండలంలోని వాల్గొండ శ్రీ రామలింగేశ్వర స్వామి ఆలయంలో ఈనెల 30న నిర్వహించే శ్రీరామనవమి ఉత్సవాల్లో పాల్గొనాలని బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు, టీటీడీ బోర్డు సభ్యుడు, ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు, బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు డాక్టర్ సంజయ్‌కుమార్, బీజేపీ నాయకులు డాక్టర్ జేఎన్. వెంకట్, మెట్‌పల్లి సీఐ లక్ష్మీనారాయణను వాల్గొండకు చెందిన ప్రజాప్రతినిధులు, నాయకులు, ఆలయకమిటీ సభ్యులు కలిసి ఆహ్వాన పత్రిక అందించారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు దండికగంగు, ధరంసోత్ కళావతి, ఎంపీటీసీ క్యాతం సుజాత, నాయకులు దండిక రాజన్న, క్యాతం నరేశ్‌రెడ్డి, ధరంసోత్ సురేందర్, డాక్టర్ లక్ష్మీనారాయణ, ఎండీ.జమాల్ పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి ప్రతీకార్యకర్త కృషి చేయాలి



వెంగళాయిపేటలో నాయకుల సమావేశం

పెగడపల్లి: బీఆర్‌ఎస్‌ను మరింత బలోపేతం చేసేందుకు ప్రతీ కార్యకర్త కృషిచేయాలని మండల అధ్యక్షుడు లోక మల్లారెడ్డి కోరారు. వెంగళాయిపేటలో బీఆర్‌ఎస్ గ్రామశాఖ సమావేశం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో సీఎం కేసీఆర్ అమలుచేసిన సంక్షేమ ఫలాలు అన్నివర్గాల ప్రజలకు ఎంతో మేలుచేశాయన్నారు. రానున్న ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని ప్రతీ కార్యకర్త సైనికుడిలా పని చేయాలన్నారు. సురేందర్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, వేణుగోపాల్, నర్సింహరెడ్డి, తిరుపతి, శ్రీనివాస్, చంద్రశేఖర్, నరేందర్‌రెడ్డి, స్వామి, ఆంజనేయులు, సత్యనారాయణరావు, రాజశేఖర్‌గౌడ్, దేవయ్య, మల్లయ్య, కరుణాకర్, రమణాచారి తదితరులు పాల్గొన్నారు.

ఆయుష్మాన్ భారత్ సద్వినియోగం చేసుకోవాలి



లబ్ధిదారులకు పత్రాలు అందిస్తున్న సుఖేందర్

మెట్‌పల్లి: కేంద్రప్రభుత్వం అమలు చేస్తున్న ఆయుష్మాన్ భారత్ యోజనను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి చెట్లపల్లి సుఖేందర్‌గౌడ్ కోరారు. పట్టణంలోని 18వార్డులో సోమవారం నమోదుకార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. 2 వేలకు పైగా వ్యాధులకు ఇందులో ఉచితంగా చికిత్స అందిస్తున్నారన్నారు. నియోజవర్గంలో ప్రతీగ్రామంలో నమోదు కార్యక్రమాన్ని బీజేపీ ఆధ్వర్యంలో ఉచితంగా నిర్వహిస్తున్నామని, అర్హులు తమపేర్లను నమోదు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో పట్టణాధ్యక్షుడు బొడ్ల రమేశ్, కౌన్సిలర్ చెట్లపల్లి మీనా, జుంగుల అనిల్, మిట్టపల్లి కృష్ణమూర్తి తదితరులున్నారు.

బాధ్యతలు స్వీకరించిన ఎస్సై సందీప్

జగిత్యాలక్రైం: జగిత్యాల పట్టణ ఎస్సైగా ఎస్.సందీప్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో డీసీఆర్బీకి అటాచ్ ఎస్సైగా పనిచేసిన సందీప్‌ను మూడురోజుల క్రితం పట్టణ ఎస్సైగా బదిలీ చేయగా సోమవారం బాధ్యతలు స్వీకరించారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

సారంగాపూర్: ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జగిత్యాల రూరల్ సీఐ ఆరీఫ్ అలీఖాన్ అన్నారు. సోమవారం సారంగాపూర్ మండలంలోని పలు గ్రామాల్లో పర్యటించి, రేచపల్లిలో ప్రజలతో మాట్లాడారు. ప్రజలు నేరగాళ్లపట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎవరైనా అనుమానితులు గ్రామంలో సంచరిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. సీసీ కెమెరాల ఏర్పాటుపై అవగాహన కల్పించారు. జెడ్పీటీసీ మనోహర్‌రెడ్డి, ఎస్సై మనోహర్‌రావు, సర్పంచ్ ఎడమల జయ, ఉపసర్పంచ్ రాజేశం, ఎంపీటీసీ భూక్య లావణ్యారాథోడ్, గ్రామస్తులు ఉన్నారు.

ఎన్‌ఎస్‌ఎస్ శిబిరం



వీధులను శుభ్రం చేస్తున్న విద్యార్థులు

కోరుట్లరూరల్: మండలంలోని చిన్నమెట్‌పల్లి గ్రామంలో కోరుట్ల ప్రభుత్వ డిగ్రీకళాశాల విద్యార్థుల ప్రత్యేక ఎన్‌ఎస్‌ఎస్ శిబిరం కొనసాగింది. సోమవారం విద్యార్థులు గ్రామంలో స్వచ్ఛభారత్ నిర్వహించి వీధులు శుభ్రం చేశారు. కార్యక్రమంలో ప్రోగ్రాం అధికారి సాసాల మల్లికార్జున్, సర్పంచ్ నూతిపెల్లి రాజు, ఎంపీటీసీ పంచిరి విజయ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

ఆయుష్ హెల్త్‌కిట్లు పంపిణీ



మేడిపెల్లి: మండలకేంద్రంలోని కస్తూరిబా పాఠశాలలో సోమవారం ఆయుష్ ఆధ్వర్యంలో సాంప్రదాయ వైద్య విధానాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా విద్యార్థినులకు ఆయుష్ హెల్త్‌కిట్లు, రాగిలడ్డులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్యాధికారి అఫీజున్నీషా, షబ్బీర్, సర్పంచ్ వరలక్ష్మి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.